క్లుప్తంగా

కోర్టు ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానం



న్యాయమూర్తులకు ఆహ్వాన పత్రాలు అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేటలో ఈనెల 24న ఆదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవంలో పాల్గొనాలని స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం హైదరాబాద్‌లో హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ విజయ సేనారెడ్డి, జస్టిస్ వినోద్‌కుమార్‌ను కలిసి ఆహ్వానపత్రాలు అందజేశారు. వారిని కలిసిన వారిలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్యయాదవ్, కోశాధికారి యాదగిరి, జే.శశిధర్ ఉన్నారు.

కోర్టు ప్రారంభంలో పాల్గొనాలి

సూర్యాపేటలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈనెల 24న ఆదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవంలో న్యాయవాదులందరూ పాల్గొనాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ కోరారు. గురువారం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయవాదుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి సురేష్, ఆదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చీదెళ్ల ఆలయంలో పూజలు



హోమం చేస్తున్న భక్తులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో గల శ్రీలక్ష్మీతిరపతమ్మ గోపయ్య దేవాలయ పునఃనిర్మాణంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు ఉదయభాస్కరశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, చండీహోమం, శిఖర ప్రతిష్ఠ, శ్రీచక్ర యంత్ర పూజలు నిర్వహించారు. చండీహోమంలో పరెడ్డి సీతారాంరెడ్డి, మోదుగు నర్సిరెడ్డి, నలబోలు వెంకట్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పురోహితులు బాదరబోయిన గోపయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, రాజీవ్‌గాంధీ, గుర్రం అమృతారెడ్డి, సంతోష్, జూలకంటి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి మాజీ మంత్రి పరామర్శ

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని నసీంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మూల యల్లయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో గురువారం ఆయనను మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం మండలంలోని మిడతనపల్లి లో గంగ దేవమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, మండల అధ్యక్షుడు కందాల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి శిగ శ్రీను, ఉపేందర్‌రెడ్డి, ముస్కు రామచంద్రారెడ్డి, వీరన్న తదితరులు ఉన్నారు.

వాసిరెడ్డి సోమిరెడ్డి వర్ధంతి

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల పరిధిలోని తొండ గ్రామంలో సీపీఐ నాయకుడు వాసిరెడ్డి సోమిరెడ్డి ప్రథమ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, ఎం.లక్ష్మయ్య, రాజారామ్, అశోక్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న దాత

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని కందగట్ల గ్రామానికి చెందిన శిగ వీరయ్యగౌడ్ వర్ధంతి సందర్భంగా అతడి కుమారుడు శిగ మహేష్ గ్రామంలోని జెడ్పీ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, శేఖర్, లింగయ్య పాల్గొన్నారు.

చిన్నారులకు విటమిన్-ఏ ద్రావణం తాగించాలి

అర్వపల్లి : చిన్నారులకు విటమిన్-ఏ ద్రావణాన్ని తప్పనిసరిగా తాపించాలని అర్వపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎల్.చరణ్ కోరారు. గురువారం మండలంలోని సూర్యనాయక్‌తండాలో చిన్నారులకు విటమిన్-ఏ ద్రావణాన్ని తాగించారు. ఏఎన్ఎం, వైద్యసిబ్బంది ఉన్నారు.

అందని 'ఉపాధి' వేతనం

- నెలలు గడుస్తున్నా పెండింగ్‌లోనే బిల్లులు
- పనులు చేయలేమంటున్న కూలీలు
- త్వరలో అందేలా చూస్తామంటున్న అధికారులు



చెట్లముకుందాపురంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

పెన్‌పహాడ్ : ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు వేతనాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలీలకు నిబంధన ప్రకారం 15రోజుల్లోగా వేతనాలు చెల్లించాలి. కాని నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో ఆర్థికలితో పనులు చేయలేమని కూలీలు వాపోతున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు పనులకు వచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు. ఉపాధి పనులకు రండి అని ఈజీఎస్ అధికారులు బతిమిలాడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

మండలంలోని 29గ్రామాల్లో 12,050 జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రతి ఏటా 8500 మంది కూలీలు ఉపాధి పనులను ఉపయోగించుకుంటున్నారు. నాలుగైదు ఏళ్లుగా భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో ఉపాధి కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం బోరుబావుల్లో భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయ పనులు కూడా తగ్గాయి. అయినా కూలీలు సకాలంలో బిల్లులు ఇవ్వడంలేదని ఉపాధి పనులకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు దినసరి కూలీ రూ.272 నిర్ణయించింది. మండలంలోని పలు గ్రామాల్లో వేలాది మంది కూలీలు ఉన్నప్పటికీ ఉపాధి పనులకు వచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు.

పనులు ఉన్నా కూలీల స్పందన కరువు..

ఉపాధి పనులు చేసుకోవడానికి గ్రామాల్లో గుర్తించిన పనులు చాలా వరకు ఉన్నాయి. వ్యవసాయ భూముల్లో చెట్లకు పాదులు తీయడం, డొంక రోడ్లు వెడల్పు, నర్సరీల్లో మొక్కలు పెంచడం, నీళ్లు పోయడం, చెరువుల్లో పూడికతీత తదితర పనులను అధికారులు గుర్తించారు. మండలంలో దాదాపు 10వేలకు పైగా ఉన్న కూలీలు ప్రతి ఏటా 8వేలకు మందికి పైగా పనులు చేసుకునే అవకాశం ఉంది. కానీ మండలంలో ప్రస్తుతం 450మంది మాత్రమే ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఆయా గ్రామాల్లో ఈజీఎస్ క్షేత్ర సహాయకులు కూలీలను కలిసి ఉపాధి పనులకు రావాలని కోరుతున్నా స్పందన లేకుండా పోతోంది. గతంలో చేసిన పనులకే వేలాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కూలీలు వాపోతున్నారు.

వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

"ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలి. కూలి రేట్లు అధికమవ్వడంతో రైతులు పెట్టుబడులకు అప్పులు చేస్తున్నారు. వ్యవసాయ పనులకు కూలీల ద్వారా చేయిస్తే ఈజీఎస్ నుంచి కొన్ని నిధులు, మరికొన్ని నిధులు రైతుల ద్వారా చెల్లించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. అప్పుడే రైతు నష్టపోకుండా ఉండడానికి ఆస్కారం ఉంటుంది.

– సైదిరెడ్డి, రైతు, చీదెళ్ల

బిల్లులు సకాలంలో అందేలా చూస్తాం



"గ్రామాల్లో ఉపాధి కూలీలకు సరిపడా పనులు గుర్తించాము. పనులకు రావాలని కూలీలను అడుగుతున్నాం. చేసిన పనులకు బిల్లులు రావడంలేదని ప్రస్తుతం మండలంలో 450మంది కూలీలే పనులకు వస్తున్నారు. మరో వారంలో రెండు, మూడు వేల మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చే అవకాశం ఉంది. పెండింగ్ బిల్లులు సకాలంలో అందేలా కృషి చేస్తాం.

– రవి, ఏపీఓ, పెన్‌పహాడ్

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

సూర్యాపేటటౌన్ : సైన్స్ టాలెంట్ టెస్టులతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శారద, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్‌బాబు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25న పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, సూర్యాపేట సైన్స్ ఫోరం సంయుక్తంగా నిర్వహించే సైన్స్ టాలెంట్ టెస్టుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికల్లో నిర్వహించే ఈ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తరగతుల తెలుగు, ఇంగ్లిష్ మీడియం వారికి ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ జాఫర్, జిల్లా మహిళా కార్యదర్శి చింతరెడ్డి విజయలక్ష్మి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాబురావు పాల్గొన్నారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు



స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న అర్చకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు గురువారం ముగిశాయి. బ్రహ్మోత్సవాలకు ముందు మూడు రోజుల పాటు అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నమ్మాళ్వార్లకు పరమపదోత్సవ కార్యక్రమాన్ని జరిపి అధ్యయనోత్సవాలను పూర్తి చేశారు. అనంతరం ద్రవిడ వేదపఠనం, పూజా కార్యక్రమాలు జరిపారు. స్వామి, అమ్మవార్లు, ఆళ్వార్లను ఆలయంలో ఊరేగించారు. కార్యక్రమంలో దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, మాజీ జెడ్పీటీసీ కొప్రపెడత అవిలయ్య, బైరబోయిన మహరాజు, దేవస్థానం ఈఓ వై.శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పి.శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి రంగయ్య, రాగి అనిల్, కోటిప్రసాద్, నాగరాజు, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, స్థానాచార్యులు జియర్ వెంకటనర్సింహచార్యులు, భరతాచార్యులు, వరదాచార్యులు పాల్గొన్నారు.

రైతాంగంపై దాడులను ఖండించాలి



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై రబ్బర్ బులెట్లతో పోలీసులు దాడిచేయడంతో యువరైతు శుభకరన్ సింగ్ మృతి చెందాడని, అందుకు మోదీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని, రైతులపై ప్రభుత్వం చేస్తున్న దాడులను ఖండించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి దండ వెంకట్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దంతాల రాంబాబు కోరారు. ఈ సందర్భంగా రైతులపై దాడులను ఖండిస్తూ గురువారం సూర్యాపేట పట్టణంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఢిల్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతుంటే, ఆ రైతు ఉద్యమంపై మోదీ ప్రభుత్వం దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు సైదులు, పోలేబోయిన కిరణ్, దేసోజు మధు, దండ శ్రీనివాస్‌రెడ్డి, బండి రవి, పెద్దింటి అశోక్‌రెడ్డి, దండి ప్రవీణ్, మండడి శ్రీధర్, రహీం, బొడ్డు ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులపై పోలీసుల దాడులు దుర్మార్గం

మద్దిరాల : ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగంపై పోలీసులు చేసిన దాడులు దుర్మార్గమని, మోదీ ప్రభుత్వం రైతు ఉద్యమాన్ని అణచివేయాలని చేసే ఆలోచనలను మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో రైతులు రోడ్ల పైకి వచ్చి పోరాటం చేస్తున్నారని, అలాంటి రైతులపై కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, నాయకులు పోలోజు సైదులు, ఉపేందర్, మీనయ్య, మల్లయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న పూర్ణ శశికాంత్

తుంగతుర్తి : ప్రతి విద్యార్థి లక్ష్యసాధనకు కష్టపడి చదవాలని వ్యక్తిత్వ వికాస శిక్షకుడు పూర్ణ శశికాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా దృఢ సంకల్పంతో చదివితే అన్నిరంగాల్లో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వై.బి శ్యామలత, పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య, జిల్లా సెక్రటరీ కొండగడుపుల ఎల్లయ్య, పోలేపాక రామచంద్రు, వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, బీవీ నాయక్, హసీనా, నాగలక్ష్మి, జ్యోతి, వెంకటరమణ, అనూష, చంద్రకళ, వీరబాబు, దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లకుర్మలు చెల్లించిన నగదు ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుంగతుర్తి : గొర్రెల పంపిణీ కోసం గత ప్రభుత్వంతో గొల్లకుర్మలు చెల్లించిన డీడీల నగదును తిరిగి ఇవ్వాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రెండో విడత గొర్రెల కోసం డీడీలు కట్టిన ప్రతిఒక్కరికి రూ.5లక్షలు నగదు వారి అకౌంట్‌లో జమ చేయాలని డిమాండ్ చేశారు. డీడీలు చెల్లించి ఏడాది గడిచినా నేటికి గొర్రెల ఇవ్వలేదని, డీడీల డబ్బులు చెల్లించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెండో విడత గొర్రెల పంపిణీని అమలు చేయాలని లేదా చెల్లించిన డీడీల నగదు తిరిగి ఇవ్వాలన్నారు. గొల్లకుర్మలకు విద్య, వైద్యం, భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ నాయకులు కొమ్మ లింగయ్య, మట్టపల్లి నర్సయ్య, ఉప్పుల లింగయ్య, బోయిని లింగయ్య, మల్లయ్య, రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు అందజేత



విరాళం అందజేస్తున్న దాతలు

మద్దిరాల : మండలంలోని కుక్కడం గ్రామంలో త్వరలో నిర్వహించే బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు గ్రామానికి చెందిన పెద్దగౌడ్ రూ.1,16,116లు, పద్మశాలీ కులస్తులు రెబ్బ సోమయ్య రూ.10,116లు, రాపోలు నాగయ్య రూ.5,116లను గురువారం ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు వరదాచార్యులు, ఎంపీటీసీ ముక్కాల అవిలమల్లు, జలగం అచ్చయ్య, కోడి శ్రీనివాస్, మద్దెల పెదగాని మల్లయ్య, మద్దెల పెదగాని సోమయ్య, కాశీం, బొమ్మెర వెంకన్న, మద్దెల యాకయ్య, మద్దెల భిక్షపతి, వల్లపు వెంకన్న, ముక్కాల వీరస్వామి, మల్లయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లిలో ఆధార్ సెంటర్‌ను పునరుద్ధరించాలి

అర్వపల్లి : అర్వపల్లిలో ఆధార్ సెంటర్‌ను పునరుద్ధరించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని ఎంసీపీఐయూ డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధార్ కేంద్రం పునరుద్ధరణ విషయమై ఇప్పటికే కలెక్టర్‌తో పాటు మండల అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. కొన్నేళ్లుగా ఇక్కడ ఆధార్ సేవలు నిలిచిపోయాయని, ప్రజలు 30కిలోమీటర్ల దూరంలోని సూర్యాపేటకు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. పేదలు ఎంతో వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారని, మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు వేముల పెద్దనర్సయ్య, రమేష్, సుధీర్, సరస్వతి, వెంకన్న, పద్మ ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్



మద్దిరాల : తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



నూతనకల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి (తుంగతుర్తి) : త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌దే విజయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను రెండు అమలు చేస్తున్నామని, మరో రెండు హామీలను త్వరలోనే అమలు చేస్తామన్నారు. తిరుమలగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నిధులు మంజూరైనట్లు తెలిపారు.

అధికారులతో సమీక్ష..

నియోజకవర్గంలోని 9మండలాల రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఎమ్మెల్యే సామేల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇంటి నిర్మాణం పనులకు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.నరేష్, జమ్మిలాల్, యాదవరెడ్డి, లింగయ్య, సుధాకర్, సత్యనారాయణ, కందుకూరి లక్ష్మయ్య, నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

భాగ్యమ్మ మృతికి సంతాపం

పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దుంపల కృష్ణారెడ్డి తల్లి భాగ్యమ్మ గురువారం మృతి చెందింది. దీంతో భాగ్యమ్మ భౌతికకాయాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్ సందర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు నరేష్, కొండల్‌రెడ్డి, బత్తుల శ్రీను, రాపాక సోమేష్, జనార్దన్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యం

మద్దిరాల : విద్యతోనే విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తారని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలో రూ.2.30కోట్లతో చేపట్టనున్న కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశ అభివృద్ధి విద్యార్థుల చేతుల్లోనే ఉందని, విద్యార్థులను మేధావులుగా, శాస్త్రవేత్తలుగా, ఉన్నత ఉద్యోగులుగా అత్యున్నమైన పదవులను పొందాలంటే అది చదువుతోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కళాశాల నిర్మాణం కాళేశ్వరం లాగా కాకుండా నాణ్యంగా ఉండేలా అధికారులు చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు, ఎంపీటీసీ మార్త అనిత కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, బొబ్బిలి వెంకన్న, బర్పటి ఉపేందర్, అమృత మల్లు, డీఈ రమేష్, ఈఈ ఈరూపాక్ష, ఏఈ ఓబులేష్, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఎంఈఓ రాములునాయక్, ఎస్ఓ తేజశ్రీ,, మామునూరి ఉపేందర్, నలమాస ఉపేందర్, హమీద్, వినోద్, చలం, రమేష్, లింగయ్య, అనిల్, ఏలేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం

నూతనకల్ : రాష్ట్రంలో రైతు ప్రయోజనాలను కాపాడడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆగ్రో ఫెడ్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నాబార్డ్ సహకారంతో గ్రామాల్లోని సన్న, చిన్నకారు రైతులు ఎరువుల వాడకంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండటం కోసం రైతుల భాగస్వామ్యంతో నాబార్డ్ సహకారంతో రైతు ఉత్పత్తిదారుల కంపెనీని నెలకొల్పినట్లు ఆయన తెలిపారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ జైనాబీ ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, చిత్తలూరి నారాయణ, చంద్రశేఖర్, గుగులోతు రవి, ఏఓ మురళీ, నాగం సుధాకర్‌రెడ్డి, తీగల గిరిధర్‌రెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, కట్టా మల్లారెడ్డి, జటంగి గణేష్, ఎండీ జహంగీర్ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి ఎక్స్‌రోడ్డు వద్ద యువజన కాంగ్రెస్ నాయకుడు బోడ శ్రీను నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను గురువారం ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, నాతి వీరమల్లు, పాశం యాదవరెడ్డి, బొట్టు సురేష్, సైదులు, రాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం, బోడ చంద్రయ్య, షేక్.వలీ, నాగు వెంకన్న, వల్లాల భానుప్రకాష్, దశరథ, అక్బర్‌పాషా పాల్గొన్నారు.

విద్యార్థినుల్లో మానసిక ఆందోళన తొలగించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గురుకుల పాఠశాలల్లో చోటు చేసుకున్న వరుస ఆత్మహత్యలను అరికట్టేందుకు విద్యార్థినుల్లో నెలకొన్న మానసిక ఆందోళనలు తొలగించే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థల్లో మౌలిక వసతులను అధికారులతో కలిసి పర్యవేక్షించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇందారపు రాజమల్లయ్య కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తక్కెళ్లపెల్లి శ్యామ్‌కుమార్, వైస్‌ప్రెసిడెంట్లు వెంకన్న, ఐసయ్య, జిల్లా మహిళ అధ్యక్షురాలు జూలూరి మమత, మెరుగు విక్రమేంద్ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని నాగారంబంగ్లా మాజీ సర్పంచ్ కుంభం కర్ణాకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు వడ్డీలకు డబ్బులు తెచ్చి పనులు చేపట్టారని అన్నారు. ఇప్పటికీ ఆ పనులకు సంబంధించిన బిల్లులు రాలేదన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినా బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు యారాల నర్సింహారెడ్డి, నాగుల్‌మీరా, కుంటపల్లి సుధాకర్, తీగుళ్ల స్వరూప ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేసిన దాతలు

నూతనకల్ : విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వెంకెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు యుజవన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ ఆర్థిక సహకారంతో అందించిన స్టడీ మెటీరియల్స్, ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు తొనుకూనురి సైదులుగౌడ్, సైరెడ్డి సుధీర్‌రెడ్డి, కుంట చంద్రారెడ్డి, పాల్వాయి నాగరాజు, పాల్వాయి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

మద్దిరాల : మండలంలోని రెడ్డిగూడెం ప్రభుత్వ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. చిన్నారులకు, గర్భిణులకు సమయానికి పౌష్టికారం అందించాలని ఆదేశించారు. అదే విధంగా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజేష్, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరయ్య మృతి తీరనిలోటు

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి గ్రామానికి చెందిన అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు, న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు దాసరి వీరయ్య(80) మృతి విప్లవోద్యమానికి తీరనిలోటని రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి అన్నారు. గురువారం వీరయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట న్యూడెమోక్రసీ నాయకులు దశరథ, మైబెల్లి, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



మద్దిరాల : స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



అర్వపల్లి : స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మద్దిరాల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారుల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకన్న, ఉపాధ్యాయులు రమావత్ రమేష్, మురళి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శేఖర్, లింగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా పాత్రలు పోషించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్, పూలన్, సూర్య, లక్ష్మయ్య, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసు, మంగమ్మ, సైదులు తదితరులు పాల్గొన్నారు.